క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి నూతన కమిటీ నియామకం



నూతన అభివృద్ధి కమిటీ సభ్యులకు నియామక పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి : శ్రీ ప్రసన్న వరదరాజులస్వామి దేవాలయ అభివృద్ధికి నూతన కమిటీని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సోమవారం ప్రకటించారు. కోట్లాది రూపాయలతో ఆలయాభివృద్ధి పనులు చేస్తున్న తరుణంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన పట్టణ ప్రముఖులు, పార్టీ నాయకులతో ఈ కమిటీని ఏర్పాటు చేశామని, ఆలయ అభివృద్ధికి శాయశక్తులా పాటుపడాలని సూచించారు. చైర్మన్‌గా సుబ్బరామ గుప్త, వైస్ చైర్మన్‌గా సురేంద్రబాబు అలియాస్ చిట్టి, సభ్యులుగా లీలా కుమార్, ధర్మయ్య, కొల్లూరు జయ, ఇందిర, మాతయ్య, కరుణాకర్ రెడ్డి, అంజూరు వెంకటేష్ బాబు, బాలసుబ్రమణ్యం యాదవ్, దామోదర్ రెడ్డి నియమించినట్లు ఆయన చెప్పారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులలో కూలీలకు రోజుకు రూ.272 వేతనం వచ్చేలా కొలతలు ఇచ్చి పనులు చేయించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. సోమవారం మండలంలోని రాజులపాలెంలో చేస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేవని, కూలీలకు విరివిగా పనులు కల్పించాలన్నారు. ఏర్పేడు మండలంలో రోజుకు 3800 మంది కూలీలు పనులు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో మామిడి, పూలు, మునగ తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఈసీ బాలాజీరావు, సాంకేతిక సహాయకుడు మనోహర్, క్షేత్ర సహాయకురాలు నవత, కూలీలు పాల్గొన్నారు.

ఏర్పేడులో అన్నదానం



అన్నదానం చేస్తున్న సత్య సాయి సేవాసమితి సభ్యులు

ఏర్పేడు: సత్యసాయి బాబా ఆరాధనోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక బస్టాండు వద్ద సత్యసాయి సేవా సమితి అన్నదానం చేసింది. తొలుత సత్యసాయి బాబా చిత్రపటానికి పూజలు చేసిన అనంతరం 300 మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు మునెయ్య, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



పశువైద్యం చేస్తున్న వెటర్నరీ శాఖ ఏడీ సునీత

రేణిగుంట: మండలంలోని ఆర్.అగ్రహారంలో సోమవారం పశు సంవర్ధక శాఖ ఏడీ సునీత సహకారంతో రాస్ మహిళాజ్యోతి మ్యూచువల్ ఫండ్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఏడీ సునీత 28 ఆవులు, 86 గేదెలు, 74 గొర్రెలకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పశువులకు పిడుదుల నివారణ మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ప్రవంతి, రాస్ కేవీకే పశువైద్యాధికారి అనూష, సుబ్బరత్నమ్మ, శంకరయ్య, మునిశేఖర్, సల్మా, తమునికృష్ణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య!

శ్రీకాళహస్తి: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థి బాత్‌రూములో ఉరివేసుకుని మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న వ్యక్తి కుమారుడు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం స్కూల్‌కు వెళ్లి హిందీ పరీక్ష రాసి ఇంటికి వచ్చిన కాసేపటికే బాత్‌రూములోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. కుమారుడు ఎంతకీ బయటకు రాకపోవడంతో బాలుడి తల్లి వెళ్లి బాత్‌రూమ్ తలుపులు పగలగొట్టి చూడగా తాడుతో ఉరివేసుకుని మృతి చెందినట్లు గుర్తించింది. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. అలాగే 10రోజుల కిందట ఇదే స్కూల్‌కు చెందిన ఓ విద్యార్థి కూడా ఆత్మహత్యకు పల్పడినట్టు సమాచారం.

గ్రామాల సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యం

సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల వ్యాప్తంగా పలు పంచాయతీ కేంద్రాలలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా జాతీయ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులను సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు.



నారాయణవనం: సర్పంచులకు ప్రశంసా పత్రాలను ఇస్తున్న సుమన్, దివాకర్‌రెడ్డి

నారాయణవనం: గ్రామాల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ అన్నారు. సోమవారం పంచాయతీ రాజ్ దివస్‌ను మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. గాంధీ, అంబేడ్కర్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యం(ఎస్‌జీడీ) సాధనలో ఉత్తమ ప్రగతిని కనబరచిన నారాయణవనం, భీమునిచెరువు, వెత్తలతడుకు పంచాయతీల సర్పంచులకు, కార్యదర్శులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అధ్యక్షత వహించిన ఎంపీపీ దివాకర్‌రెడ్డితోపాటు సుమన్‌కుమార్ మాట్లాడారు. గ్రామాల అభివృద్ధితోపాటు ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉపాధి పనులతో, స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రజల వ్యక్తిగత అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని కోరారు. మండలంలోని 19గ్రామ పంచాయతీలలో సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుణశేఖర్, ఈఓపీఆర్‌డి వేణయ్య, సర్పంచులు మురుగేశం, రామ్మూర్తి, ఎంపీటీసీ సభ్యులు రవి, పొన్నుస్వామి, పంచాయతీ కార్యదర్శులు ప్రభురావు, అనిల్, లీలాకుమారి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణతో పంచాయతీ వ్యవస్థ పటిష్టం

సత్యవేడు: పంచాయతీ రాజ్ వ్యవస్థ 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పటిష్టమైందని ఎంపీడీఓ రమణకుమార్ అన్నారు. సోమవారం సత్యవేడు మేజర్ పంచాయతీలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పి.మంజుల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో 20మంది సత్యవేడు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు శాలువాలు, పూలమాలలు కప్పి ఘనంగా సత్కరించారు. సర్పంచ్, ఎంపీడీఓ మాట్లాడారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలకు అందించడంలో పంచాయతీ రాజ్ వ్యవస్థలో స్థానిక సంస్థలే కీలక భాగస్వామ్యం వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్, పంచాయతీ కార్యదర్శులు మునిరవికుమార్, జీ.సురేష్, పి.హరీష్, వెల్ఫేర్ అసిస్టెంట్లు నవీన్, అమ్మన్, గోపి, మేస్త్రి టి.శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మండలంలో..

శ్రీకాళహస్తి రూరల్: పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు, రాచగున్నేరి ఉప సర్పంచ్ రామచంద్రయ్య అన్నారు. మండలంలోని ప్రతి పంచాయతీలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, ప్రజా ప్రగతి ట్రస్ట్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు. మహిళా సంరక్షణ అధికారి మునిభారతి, వెల్ఫేర్ అసిస్టెంట్ సురేఖ పాల్గొన్నారు.



సత్యవేడు : పారిశుధ్య కార్మికులకు సన్మానం

తొట్టంబేడులో...

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం పురస్కరించుకుని తొట్టంబేడు మండలంలోని 27 పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులు చేసి ఆదర్శంగా నిలిచిన పంచాయతీ కార్యదర్శులను సన్మానించారు.అలాగే ఆయా గ్రామ సర్పంచుల చేతుల మీదుగా వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ గీత ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. పలువురు సర్పంచ్‌లను పూలమాలలు, శాలువలతో సన్మానించారు. ఎంపీపీ మాట్లాడారు. వైస్ ఎంపీపీ జమ్మళ్ల శ్రీనివాసులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సీసీ గురవయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి రూరల్ : మాట్లాడుతున్న రాచగున్నేరి ఉపసర్పంచ్ రామచంద్రయ్య



తొట్టంబేడు : చిట్టత్తూరులో..



ఏర్పేడు : సమావేశంలో మాట్లాడుతున్న గీత

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పెద్దకనపర్తిలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం మాస్టర్ ట్రినర్ హేమలత ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడకం తగ్గించి, రైతులు ఖర్చులు తగ్గించే దిశగా అడుగులు వేయాలని కోరారు. రైతులు ప్రధాన పంటకు ముందుగానే కనీసం 18 రకాల నవధాన్యాలను భూమిలో చల్లి, ఏపుగా పెరిగిన తరువాత భూమిని కలియదున్నుకోవడం వల్ల భూసారం పెరిగి, పంట దిగుబడి పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పురుగులు, తెగుళ్లను తక్కువ ఖర్చుతో సులభంగా నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



.ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు

రేణిగుంట: దేశంలో రైల్వే కార్మికుల హక్కుల సాధన కోసం ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్ ఎన్నో పోరాటాలు చేసిందని యూనియన్ సీఆర్ఎస్ బ్రాంచ్ మాజీ కార్యదర్శి ఆర్ఎం విజయకుమార్ తెలిపారు. యూనియన్ శతాబ్ది ఉత్సవాలు చేసుకుంటున్న తరుణంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. చంద్రిక ప్రసాద్, ముకుందలాల్ సర్కార్, వివి గిరి, జోషి, జమునాదాస్ మెహతా, జయప్రకాష్ నారాయణ, పీటర్, ప్రియగుప్తా వంటి మహానుభావులు అనేక పోరాటాలు చేసి కార్మికులకు న్యాయంగా అందాల్సిన సదుపాయాలను సాధించినట్లు ఆయన గుర్తు చేశారు. కార్మికులకు బోనస్, మహిళలకు వేతనంతో కూడిన లీవు, రన్నింగ్ స్టాఫ్‌కు అలవెన్సులు వంటివి సాధించుకున్నట్లు తెలిపారు.

గ్రీవెన్స్ డే విధులకు అధికారులు డుమ్మా





ఖాళీగా ఉన్న తహసీల్దారు కుర్చీ, తహసీల్దారు కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న మహిళలు

- ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు

బుచ్చినాయుడుకండ్రిగ: తహసీల్దార్ టీవీ.సుబ్రమణ్యం, ఐకేపీ ఏపీఎం ఇందిరమ్మ, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ కార్యదర్శి సుబ్బారావు సోమవారం గ్రీవెన్స్ డే విధులకు హాజరు కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అధికారుల కోసం ఎదురుచూస్తూ చెట్ల కింద పడిగాపులు కాశారు. వివిధ పనుల నిమిత్తం, సమస్యలు నివేదించేందుకు వచ్చిన వారు చివరకు నిరాశతో వెనుదిరిగారు.

శివయ్య సేవలో తెలంగాణ డిప్యూటీ స్పీకర్



ధ్వజస్తంభం వద్ద తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్

శ్రీకాళహస్తి: ముక్కంటిని సోమవారం తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు గౌడ్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తిప్రపత్తులతో మహా కుంభాభిషేకం పూజలు

- తొలిరోజు మూలవిరాట్ విగ్రహాలకు గ్రామోత్సవం

పిచ్చాటూరు : మండలంలోని సిద్ధిరాజుకండ్రిగలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీగణపతి హనుమతీశ్వరాలయ (శ్రీ సోమనాథేశ్వరాలయం) మహాకుంభాభిషేకం భక్తిప్రపత్తులతో సోమవారం ప్రారంభమైంది. మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్ర నాయుడు కలశ పూజలకు హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు సమక్షంలో ఉదయం 9 గంటలకు గణపతిహోమం, మహాలక్ష్మీ పూజ, గోపూజ, ధన, నవగ్రహ పూజలు చేశారు. అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించనున్న మూలవిరాట్ రాతి విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. గ్రామంలో పూజలందుకున్న దేవతామూర్తులు ఆలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. సాయంత్రం మూలవిరాట్ రాతి విగ్రహాలను ఆలయ స్థపతి శ్రీ పుండరీక వరదానంద స్వామి పర్యవేక్షణలో వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ శ్రీ లక్ష్మీగణపతి, హనుమాన్, శ్రీ పార్వతీ సమేత సోమనాథేశ్వరులు, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, కల్యాణ నవగ్రహ విగ్రహాలను ఆయా గర్భాలయాల్లో భక్తుల నామస్మరణల నడుమ ప్రతిష్ఠించారు. సాయంత్రం వాస్తు శాంతి, మంగళ హారతి, భజనలు, కోలాటాలు నిర్వహించారు. రాత్రి టీటీడీ గాయకులు శివకుమార్ హనుమాన్ చాలీసా పారాయణం, టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో హరికథ, నాదనీరాజనం కార్యక్రమం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త, శ్రీ లక్ష్మీగణపతి హనుమతీశ్వరాలయ సొసైటీ సభ్యులు పర్యవేక్షించారు.



గ్రామోత్సవంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు

నేడు ఎమ్మెల్యే ఆదిమూలం హాజరు

శ్రీ సోమనాథేశ్వరాలయ మహా కుంభాభిషేకంలో మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొననున్నట్లు ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు తెలిపారు.



ఆంజనేయస్వామి, పార్వతీ సమేత సోమనాథేశ్వరస్వామి తదితర విగ్రహాలు



గర్భాలయంలో ప్రతిష్ఠించిన స్వామి వారి మూలవిరాట్



అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్రనాయుడు

జగనన్నకు కోటి కుటుంబాల భరోసా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి: రాష్ట్రంలో కోటి కుటుంబాల భరోసా జగనన్నకు దక్కిందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పీపుల్ సర్వేలో కోటి కుటుంబాలు తమ అభిప్రాయాన్ని నమోదు చేసుకోవడం, జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా సోమవారం పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును పుస్తక రూపంలో ప్రజలకు తెలియజేశారన్నారు. గడప గడపకు వెళ్తున్నప్పుడు కులమతాలు, పార్టీలకతీతంగా జన నీరాజనం పలుకుతున్నారని, ప్రజలకు జగనన్న నేరుగా సంక్షేమ ఫలాలు అందివ్వడమే దీనికి కారణమన్నారు. ప్రభుత్వం గురించి చంద్రబాబునాయుడు చెబుతున్న అబద్ధపు మాటలు, ఎల్లో మీడియా పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలెవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 2024 ఎన్నికల్లో అఖండ మెజార్టీతో మళ్లీ జగనన్నను సీఎం చేయడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. అలాగే శ్రీకాళహస్తిలో గత 30 ఏళ్ల అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ చేసిందేమీ లేదని, తమ ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని, పరిష్కరించిన సమస్యలను ఆయన వివరించారు.

బాబు, లోకేష్‌కు సవాల్

పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్ తమ సీఎంపై సవాళ్లు విసురుతున్నాడని, చంద్రబాబుకు, లోకేష్‌కు దమ్ము, ధైర్యం ఉంటే మీరు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు మీరు అందించిన సంక్షేమాన్ని బుక్‌లెట్‌ల రూపంలో గడప గడపకు అందజేస్తారా? అని సూటిగా ప్రశ్నించారు. సంక్షేమ పథకాలకు క్యాలెండర్ ఇచ్చి జగనన్న చెప్పిన సమయానికి ప్రజల ఖాతాలో నేరుగా జమ చేస్తున్నారు కాబట్టే తాము ప్రజల్లోకి వెళ్తున్నామని, ప్రజలు కూడా తమను ఆదరిస్తున్నారన్నారు.

శివరాత్రికి వచ్చే వ్యాపారుల్లా సుధీర్‌రెడ్డి కుటుంబం..

శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ముందు ఖర్జూరం పండ్ల వ్యాపారస్తులు వస్తారని, పండుగ అయిన తర్వాత అన్నీ సర్దుకుని వెళ్లిపోతారని, అదే కోవలో బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబం కూడా ఉంటోందని అపహాస్యం చేశారు. ఎన్నికల సమీపిస్తుండడంతో హైదరాబాద్ నుంచి ప్రజలను మోసం చేయడానికి దిగిపోయారని వ్యంగ్యంగా అన్నారు. బృందమ్మ, సుధీర్‌రెడ్డి.. మళ్లీ కల్లబొల్లి మాటలతో ప్రజల వద్ద డ్రామాలు ఆడేందుకు సిద్ధమయ్యారన్నారు. కరోనా కష్ట కాలంలో కూడా తాను ప్రజల మధ్యే ఉంటూ ఎంతో సేవ చేశానని, కరోనా కష్టకాలంలో ప్రజలకు పూర్తిగా టీడీపీ నాయకులు ముఖం చాటేశారని, వారిని నిలదీయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గుమ్మడి బాలకృష్ణయ్య, పగడాల రాజు, వడ్డతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి, జై శ్యామ్, కొలూరు హరినాయుడు, ఢిల్లీ బాబు, సుమతి, రుష్యేంద్ర మణి, కొలూరు జయ, ధనలక్ష్మి, సుబ్బారాయులు, నాగభూషణ్, గంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అగస్తీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



అగస్తీశ్వరాలయం

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం సాయంత్రం అంకురార్పణం చేశారు. పది రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలు మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయని ఆలయ అర్చకులు రమేష్ గురుకల్, ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. ఆలయంలో పునఃనిర్మాణ పనుల కారణంతో మూడేళ్ల తర్వాత వార్షిక ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజార్చన కార్యక్రమాలను పూర్తి చేశారు. సాయంత్రం మరగదవల్లీ, అగస్తీశ్వర స్వామి ఉత్సవమూర్తులు తిరుచ్చి వాహనంపై ఆలయ ప్రాకారంలో ఊరేగారు. అనంతరం నిర్మిత యాగశాలలో శాంతి, ఇతర హోమాలను గణపతి పూజతో పూర్తి చేశారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు నందీశ్వర చిత్రపటమున్న వస్త్రాన్ని ఆలయ ధ్వజస్తంభానికి అధిరోహింపచేయడానికి ఏర్పాట్లు చేశారు. రాత్రి స్వామి వారు చంద్రప్రభ వాహనంపై సముదాయం గ్రామ వీధుల్లో విహరిస్తారు.



ఉత్సవ మూర్తుల ఊరేగింపు

వాహన సేవలివే.. : 26న బుధవారం సాయంత్రం సింహవాహనం, 27న గురువారం హంసవాహనం, 28న శుక్రవారం శేషవాహనం, 29న శనివారం నంది వాహనం, 30న ఆదివారం గజవాహనంపై స్వామి వారు గ్రామోత్సవంలో విహరిస్తారని నిర్వాహకులు తెలిపారు. మే 1న సోమవారం రాత్రి రథోత్సవం, 2న మంగళవారం సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ, 3న బుధవారం ఉదయం నటరాజ ఉత్సవం, సాయంత్రం రావణేశ్వర వాహనంపై స్వామి దర్శనమిస్తారు. మే 4న గురువారం ఉదయం త్రిశూల స్నానం అనంతరం సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.

'పురావస్తు' పనుల అడ్డగింత

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు రెవెన్యూ పరిధిలోని ముట్టంగితిప్ప వద్ద పురావస్తుశాఖ నూతనంగా నిర్మించ తలపెట్టిన సరిహద్దు ప్రహరీ గోడ పనులను మరోసారి సోమవారం గిరిజనులు అడ్డుకున్నారు. సూళ్లూరుపేట ఆర్డీఓ, తహసీల్దార్ ఇచ్చిన హామీలను గాలికొదిలేసి పనులకు పూనుకోవడంలో ఔచిత్యమేమిటని మండిపడ్డారు. వీరికి మద్దతుగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ సంఘీభావం తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ.. పాండూరు, సుబ్బానాయుడుకండ్రిగ గ్రామస్తుల సమస్య తీరకనే పనులు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. 70ఏళ్లుగా పురావస్తుశాఖకు చెందిన భూములు పాండూరు వద్ద ఉన్నట్లు ఏ ఒక్కరూ గుర్తించకుండా, తాజాగా మద్రాసు పురావస్తుశాఖకు 65 ఎకరాలు ఉన్నట్లు ఎలా నిర్ధారణ చేస్తారని ప్రశ్నించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శాంతికు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ అంకమ్మ, సీపీఐ నాయకులు అరుణ్‌కుమార్, మురళి, ధనంజయులు శెట్టి తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: ముస్లింలకు షాదీ మహల్ కట్టిస్తానని ఎన్నికల ముందు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నందుకు సంతోషంగా ఉందని శ్రీకాళహస్తి మజ్లిస్ పార్టీ నాయకులు అన్వర్ హుస్సేన్, కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం రంజాన్ పర్వదినం పురస్కరించుకుని అయ్యలనాడు చెరువులోని ఈద్గాకు వచ్చిన ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం షాదీమహల్ నిర్మాణానికి రూ.40లక్షలు ఇస్తామని ప్రకటించి, అడ్వాన్స్‌గా రూ.2లక్షలు ఇవ్వడం ముదావహమన్నారు. కార్యక్రమంలో షేక్ మహబూబ్ బాషా, కలీముల్లా, షమీర్, కోడూరు అన్వర్, చెంబేడు కరీముల్లా, దస్తగిరి, అబ్బాస్, రాగల్వాడు మస్తాన్, అమానుల్లా, ఫిరోజ్, మునీర్, అబ్రార్, సాదిక్ తది తరులు పాల్గొన్నారు.



కృతజ్ఞతలు చెబుతున్న మజ్లిస్ పార్టీ నాయకులు

సైకిల్..డౌన్ డౌన్.. తెలుగు తమ్ముళ్ల నినాదం

వరదయ్యపాళెం: స్వయాన తెలుగు తమ్ముళ్లే ''సైకిల్ డౌన్ డౌన్'' అంటూ నినదించిన ఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని సంతవేలూరులో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ హెలెన్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత ముఖ్య అతిథులుగా హాజరై ఇదేమి ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. పుర వీధుల్లో సైకిల్ జిందాబాద్ అనాల్సిన తెలుగు తమ్ముళ్లే పొరపాటున సైకిల్ డౌన్ డౌన్ అంటూ భారీ ఎత్తున నినాదాలు చేశారు. పార్టీ శ్రేణులతో ఉన్న స్థానికులు సైతం మళ్లీ మళ్లీ డౌన్ డౌన్ అంటూ గట్టిగా చెప్పడంతో వచ్చిన అతిథులకు ఏం జరుగుతోందో అర్థం కాలేదు. వెంటనే తమ్ముళ్లపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో వారు సర్దుబాటు చేసుకున్నారు. అక్కడి నుంచి మాజీ సర్పంచ్‌గా వ్యవహరించిన బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుని ఇంటికి వెళ్లిన కొందరు తెలుగు తమ్ముళ్లు ఇంటి గోడకు అంటించిన 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను తొలగించబోతుండగా మాజీ సర్పంచ్ సతీమణి అడ్డుకోవడంతో వారు వెనుదిరిగారు. అయితే ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోమవారం రాత్రి సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయడంతో తెలుగు తమ్ముళ్లు తలలు పట్టుకున్నారు.



ఇదేమి ఖర్మ కార్యక్రమంలో ముఖ్య అతిథులు